క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని అస్సాలిహాత్ స్కూలు విద్యార్థులు రోగులకు తనవంతుగా తోడ్పాటు అందించారు. శుక్రవారం కడప నగరంలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మహా ప్రవక్త మహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) జన్మదినం మాసాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇటువంటి పవిత్రమైన మీలాదున్ నబీ మాసంలో సేవలు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హయత్, ముస్లిం ప్రముఖులు హమీద్, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి శశాంక్

కడప స్పోర్ట్స్ : కడప నగరం నాగార్జున మోడల్ స్కూలు విద్యార్థి మాస్టర్ శశాంక్ డేవిడ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పీఈటీ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన శశాంక్ డేవిడ్ తన ప్రతిభ పాటవాలతో రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారు. కాగా శశాంక్ డేవిడ్ కడపకు చెందిన ప్రముఖ జ్యోతిష్య నిపుణులు సురేష్‌బాబు కుమారుడు. పాఠశాల కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ అమృతరాజ్, మినీ ఫుట్‌బాల్ సెక్రటరీ థామస్.. చిన్నారి డేవిడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం



విజయవాడకు సామగ్రి పంపుతున్న వీసీ

వైవీయూ : పులివెందుల లయోలా కళాశాల వలంటీర్ల సేవలు ప్రశంసనీయమైనవని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రెడ్డి మార్గదర్శకంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కళ్యాణి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు.. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతోపాటు పట్టణంలోని పలువురు నుంచి బియ్యం, కంది బేడలు, చక్కెర, నూనె, గోధుమ పిండి, వస్త్రాలు, పరిశుభ్రత ఉత్పత్తులు, స్నాక్స్, ఇతర ముఖ్యమైన వస్తువులు సేకరించారు. వాటిని విజయవాడ వరద బాధితులకు చేర్చాలని విశ్వవిద్యాలయానికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి వస్తువులు స్వీకరించి వలంటీర్లను, పీఓ, కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. వారి సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కళ్యాణి, వైవీయూ సహ ఆచార్యులు టి.చంద్రశేఖర్, లలిత, సరిత, వీసీ సీసీ నాగరాజు, అధ్యాపకులు దాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామ పొలం సర్వే నంబరు 834–3లోగల 11.21 ఎకరాల ప్రభుత్వ రాళ్ల గుట్ట భూమిని క్రిస్టియన్ మతానికి చెందిన పెద్దలతోపాటు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆక్రమించుకుని చర్చితోపాటు అనుబంధంగా మరికొన్ని నివాస గృహాలు నిర్మిస్తున్నారని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్యగారి నాగమల్లేష్ ఆరోపించారు. ఆ మేరకు శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయ ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు యామినిశర్మ, బిట్రా శివనారాయణలను కలిసి అక్కడ సాగుతున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయించాలని కోరారు. ఈ సందర్భంగా నాగమల్లేష్ మాట్లాడుతూ అక్రమంగా సాగుతున్న నిర్మాణాల విషయంగా గత జులై 15న కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ఈ నెల 11న బద్వేలు ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేసినా ఇంతవరకు స్పందన లేదన్నారు. పైగా అక్కడ మాత్రం యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రాళ్ల గుట్ట భూమిని అక్రమార్కుల కంబంధ హస్తాల నుంచి కాపాడి పేద ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని జెడ్పీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కడప శాసనసభ్యురాలు రెడ్డెప్పగారి మాధవీరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అతి తక్కువ ధరతో భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ నందన్‌తోపాటు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హామీలు.. నీటి మీద రాతలు

- ఎన్నికల ముందు వాగ్దానాల గొప్పలు
- సొంత మేనిఫెస్టో విడుదల
- గెలిచిన తరువాత అమలు గాలికి
- ఇదీ 100 రోజుల్లో ఎమ్మెల్యే పాలన తీరు

కడప తొలి మహిళా ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఎన్నికలకు ముందు సొంత మేనిఫెస్టోతో నగర ప్రజలను హామీలతో ముంచెత్తారు. గెలిచిన తరువాత ఆర్భాటం తప్ప అభివృద్ధి కనిపించలేదు. నగరంతోపాటు ప్రజల సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కాలేదని నగర వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రవీంద్రనగర్, షహమీరియా మసీద్ ప్రాంతంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పిన ప్రాంతం



కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఎన్నికల మేనిఫెస్టో కర పత్రం

సాక్షి టాస్క్ ఫోర్స్ : ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి కడపను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నగర వాసులకు మెరుగైన వసతులు కల్పిస్తామని హామీలు గుప్పించారు. అందుకోసం సొంతంగా మేనిఫెస్టోను ప్రకటించారు.

మేనిఫెస్టోలోని అంశాలు

మాధవిరెడ్డి ఎన్నికలకు ముందు కడప నగరాభివృద్ధి కోసం సొంతంగా మేనిఫెస్టోను ప్రకటించారు. ఈ మేనిఫెస్టోను ఏప్రిల్ 19వ తేదీన కడప నగరం రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన కడప నియోజక వర్గ టీడీపీ సమావేశంలో విడుదల చేశారు. అందులో 'కడప నగరంలో బుగ్గవంకపై రవీంద్రనగర్ నుంచి షహమీర్‌యా మసీద్, పాతలా కాలేజీల మీదుగా సొంత నిధులతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తాం. ముస్లిం మత పెద్దలకు సొంత ఖర్చులతో రూ.10 లక్షలు ప్రమాద బీమా కల్పిస్తాం. ముస్లిం మత పెద్దల కుటుంబాలకు తోడుగా ఉంటాం. ముస్లిం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. సొంత ఖర్చుకు వెనకాడకుండా పేదరికంతో విద్యకు దూరమైన ముస్లిం పిల్లల కుటుంబాలకు మద్దతుగా ఉంటాం. విద్యా అవకాశాలు కల్పిస్తాం. హజ్ హౌస్ పరిసర ప్రాంతాలను అద్భుతంగా మారుస్తాం. అసాంఘిక శక్తులను అణచివేస్తాం.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం' అంటూ ఇలా పలు హామీలను గుప్పించారు. కడప నగర ప్రజలను నమ్మించారు.

అమలు ఏదీ?

మాధవిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాక సొంత మేనిఫెస్టో ప్రకారం హామీలను అమలు చేస్తామని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రజల సౌకర్యార్థం బుగ్గవంకపై రెండు బ్రిడ్జిల నిర్మాణాల పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామని ఎప్పటికప్పుడు చెప్పుకొంటూ వచ్చారు. అయితే దాదాపుగా ఏ హామీ గడప దాటి అమలు దిశగా అడుగు వేయలేదు. కడప ఎమ్మెల్యే కడప నగరంలో పర్యటనలకు మాత్రమే పరిమితం అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'చెత్త' పాలన

అలాగే రాజకీయ పరిపాలనా పరంగా కూడా ఎమ్మెల్యే మాధవిరెడ్డి తీరు విమర్శలకు దారి తీసింది. ప్రధానంగా కడప నగర మేయర్ సురేష్‌బాబు ఇంటిపై ఆమె అనుచరులు చెత్తను వేసి, వీరంగం చేశారు. సాక్షాత్తూ ఒక మేయర్ ఇంటిపైనే చెత్తను వేసి 'చెత్త' రాజకీయాలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఇలా పరిపాలనా పరంగా కూడా విమర్శల పాలు అయ్యారు.

అనతి కాలంలోనే అంతులేని ఆగడాలు

కొంత మంది అనతి కాల పాలనలోనే అంతులేని ఆగడాలకు పాల్పడ్డారు. వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలకు చెందిన రెండు బార్‌లు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ముంపు ప్రాంతానికి చెందిన ఒకరు, పాత కడపక చెందిన మరో నాయకుడు పలు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక రేషన్ షాపు డీలర్ల వ్యవహారమైతే ఇష్టారాజ్యంగా మారింది. ముడుపులు అప్పచెప్పిన డీలర్లను కొనసాగించారు. ఏమీ ఇవ్వలేని, ఇష్టం లేని వారిని వేధించారు. అలాంటి వారిని అన్యాయంగా తొలగించి తమకు అనుకూలమైన వారికి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేగాక ప్రభుత్వ, ప్రైవేటు అనే బేధాలు లేకుండా స్థలాలను కబ్జా చేస్తున్నారు. పలు డివిజన్లలో ఇలాంటి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మాధవిరెడ్డి ఒక ప్రజా ప్రతినిధిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలి. సామాన్యులకు మేలు చేయడంతోపాటు ఆస్తులకు రక్షణ కల్పించాలి. హామీలు.. నీటి మీద రాతలు కాకుండా అమలు చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి



ఎన్‌జీసీ విద్యార్థులతో ఎమ్మెల్యే, అధికారులు

వైవీయూ : భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవిరెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మొక్క నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వాతావరణంలో సమతుల్యత పాటించకపోతే అనర్థాలకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్‌చంద్ర, కడప ఎంఈఓ గంగిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నాగమణి, సూపర్‌వైజర్ ఫరూఖ్‌అహ్మద్, పర్యావరణశాఖ ఇంజినీర్ శ్రీనివాసులు, కార్పొరేటర్ సూర్యనారాణరావు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ సమన్వయకర్తలు శ్రీధర్‌రావు, దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాజీ నగర్‌లో వైవీయూ సేవలు

యోగివేమన యూనివర్సిటీ వలంటీర్లు పెండ్లిమర్రి మండలంలోని శివాజీ నగర్‌లో స్వచ్ఛత సేవలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కే. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఎన్ఎస్ఎస్ వైవీయూ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధి ఉక్కు పరిశ్రమతోనే సాధ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించి వలసలు, కరువును నివారించడంతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రగతి శీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం(పీఆర్ఎస్ వైఎఫ్) నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలకు నిలయమన్నారు. ఇలాంటి రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను స్థాపించి, ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని గత కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో సెక్షన్ 8(ఐ)లో పొందుపరచి పార్లమెంటు సాక్షిగా ప్రకటించడం జరిగిందన్నారు. 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తిరుపతిలో వెంకన్న సాక్షిగా హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తరుణంలో కడప జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి పలు రకాల ఉద్యమాలు, ఆందోళనలు, రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఎన్‌డీఏ ప్రభుత్వం తక్షణమే స్పందించి వెంటనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి స్పందిస్తూ ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిశ్రమ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, జిల్లా నాయకులు వెంకటేష్, వేణు, శ్రీనాథ్, వినీల్ పాల్గొన్నారు.

మహాత్మా..మన్నించు..!



గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- గాంధీ పేరుతో ఉన్న పాఠశాలలోనే స్వచ్ఛత కరువు
- చెత్తాచెదారంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం

కడప కార్పొరేషన్ : మహాత్మా గాంధీ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని అమలు చేస్తూ ఊరు, వాడా అన్ని చోట్ల పరిశుభ్రతా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సుమారు రెండు, మూడు ట్రాక్టర్ల చెత్త డంప్ చేయబడి ఉంది. ఈ చెత్త ఎక్కడి నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో తెలియదు గానీ.. దీనిని ఎత్తివేయడానికి ఇటు పాఠశాల యాజమాన్యం గానీ, నగరపాలక సంస్థ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గాంధీ పేరుతో ఏర్పాటు చేసిన పాఠశాలలోనే స్వచ్ఛత లేకపోవడం పట్ల పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ అపరిశుభ్రమైన వాతావరణ ప్రభావం విద్యార్థులపై పడే ప్రమాదముందని, వారికి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. స్వచ్ఛతపై నగరపాలక అధికారులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే దీన్ని ఎత్తివేయించాలని వారు కోరుతున్నారు.

సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలి



కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

వైవీయూ : కడప కార్పొరేషన్ స్వాధీనంలో ఉన్న సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మొహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిని ఫ్యాప్టో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని చెన్నూరు బస్టాండ్ వద్ద విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా వనరుల కేంద్రం, సైన్స్ మ్యూజియంలు నిర్మించి కొనసాగించేవారన్నారు. వీటిలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలు ఇవ్వడంతోపాటు, విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శనకు వినియోగించే వారన్నారు. అయితే గత కొంతకాలంగా నిధుల కొరత కారణంగా సైన్స్ ప్రదర్శనలు నిలిచి పోయాయని తెలిపారు. ఈ భవనాలను కడప కార్పొరేషన్ అధికారులు స్వాధీన పరుచుకొని అందులో ఆధార్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారన్నారు. కార్పొరేషన్ అధికారులు భవనాన్ని స్వాధీనపరచుకోవడం వల్ల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సైన్స్ ప్రదర్శనలను తిరిగి ప్రారంభించేందుకు సమగ్ర శిక్ష పథకం నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కలెక్టర్ ఈ విషయంపై జోక్యం చేసుకొని విద్యా వనరుల కేంద్రం, సైన్స్ మ్యూజియం భవనాలను విద్యాశాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాషా, ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు టి.ఖాదర్ భాష, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షులు ఆర్.అబ్దుల్లా, యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె. నరసింహారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, బిటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.హరి కొండయ్య, ఏపీటీఎఫ్(257) నాయకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైవీయూలో రూసా ప్రాజెక్టు ఫెలోల నియామకం

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం ముగ్గురు ప్రాజెక్ట్ ఫెలోలను నియమించింది. మెటీరియల్స్ సైన్స్ నానోటెక్నాలజీ ప్రొఫెసర్ ఆచార్య ఎంవి.శంకర్, సహ ఆచార్యులు డాక్టర్ ఎస్. ఆదినారాయణరెడ్డి, డాక్టర్ మమతకుమారి మార్గదర్శకంలో కె.బాలసుబ్బారావు, కేదారేశ్వర్, వి.సంతోషలను ప్రాజెక్టు ఫెలోలుగా నియమిస్తూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి నియామకపు పత్రాల అందజేశారు. నాణ్యమైన పరిశోధనలు, పత్రాలు రూపకల్పన జరగాలని వారికి సూచించారు. రూసా డైరెక్టర్ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రూసా 2.0 మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రాజెక్ట్‌కు వైవీయూ రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం



వక్తను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన చేయవచ్చని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా పేర్కొన్నారు. కళాశాలలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులచే ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు జి.ఎల్.ఎస్. ప్రసాద్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై, బి.శ్రీదేవి పర్యావరణంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సి.వి. కృష్ణవేణి, కె.ప్రకాష్‌నారాయణ రెడ్డి, ఎం.గురుమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, శచీదేవి, రాఘవేంద్ర, కుమార్, వీరయ్య పాల్గొన్నారు.

27న ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 27న నిర్వహిస్తున్న సీతారాం ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కామ్రేడ్ సీతారాం ఏచూరితో పరిచయం ఉన్న జేఎన్‌యూ విద్యార్థులు పలు రంగాల్లో స్థిరపడ్డ వారు ఉన్నారని, జిల్లా ఎంపీలుగా గెలిచి పార్లమెంటులో ఆయనతో పరిచయం ఉన్నవారు ఉన్నారన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ హాజరవుతున్నట్లు తెలిపారు. భారత ప్రజాస్వామ్యంలో సీతారం ఏచూరి లేని లోటు తీరనిదన్నారు. విలువల కోసం నిబద్ధతతో ఆయన సాగించిన నడక ఎందరికో దారి చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఇక్కట్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామీణ నిరక్షరాస్యులు సైతం విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించే విధంగా ఈజీ ఆన్‌లైన్ విధానాన్ని అందించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లోని సీనియర్ అసిస్టెంట్ మధుకుమార్‌కు ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలం నుంచి విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లించలేకపోతున్నారని, దీని కారణంతో విద్యుత్ వినియోగించిన చెల్లింపుల కంటే అపరాధ రుసుం పేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని, దీనంతటికీ కారణం విద్యుత్ బిల్లుల చెల్లింపులు గందరగోళంగా ఉండటమే కారణమన్నారు. బ్యాంకు అకౌంట్ నెంబర్ ఇవ్వాలని, దాని ద్వారా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లిస్తూ విద్యుత్ సంస్థను లాభాల బాటలో ఉంచుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

శాంతి పథం.. ప్రశాంతతకు మూలం

నేడు ప్రపంచ శాంతి దినోత్సవం



మనిషి జీవితంలో ప్రశాంతతకు విలువైన స్థానముంది. ఎంత డబ్బు ఉన్నా మనసుకు శాంతి లేనిదే తృప్తిగా జీవించలేం. రాజ్యాలు సంపాదించిన వారి కంటే గుప్పెడు శాంతిని పొందగలిగిన వారే ప్రపంచ విజేత అన్నారు అలెగ్జాండర్. దీన్నిబట్టి శాంతికి ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థమవుతోంది. శనివారం ప్రపంచ శాంతి దినోత్సవం.

కడప కల్చరల్ : వివిధ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 1981లో తమ సమావేశాల మొదటి రోజున శాంతి దినోత్సవంగా పాటించింది. నాటి నుంచి ప్రతియేటా సెప్టెంబరు 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యుద్ధాల నుంచి, హింస నుంచి మానవ జాతికి విముక్తి కల్పించాలన్నదే దీని ఉద్దేశం. ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలతో ప్రజల్లో అశాంతి నెలకొంటోంది. నేటికీ మన దేశంతో సహా పలు దేశాలపై యుద్ధమేఘాలు కదులుతూనే ఉన్నాయి. ప్రపంచ శాంతిని బోధించిన బుద్ధుడు పుట్టిన మన దేశంలో ఇతర దేశాలతో పోలిస్తే అంతర్గత అశాంతి తక్కువేనని చెప్పవచ్చు. కానీ పేదరికం, సామాజిక అసమానతలు, పొరుగు దేశ ఆక్రమణ యత్నాలు మన దేశంలో కూడా కొద్ది పాటి అశాంతిని రగిలిస్తూనే ఉన్నాయి.

దుష్ప్రచారం

ఇతర జిల్లాలతో పోలిస్తే వైఎస్సార్ జిల్లా ప్రశాంతమైనది. జిల్లాలో శాంతిని కోరుతూ పలు స్వచ్ఛంద సంఘాలు పని చేస్తున్నాయి. కులమతాల మధ్య ఘర్షణలు రేగితే అన్ని మతాల పెద్దలు రంగంలోకి దిగి క్షణాల్లో ఆ ఉద్రిక్తతను చల్లార్చి శాంతిని నెలకొల్పుతున్నారు. కానీ సినిమాల్లో మాత్రం రాయలసీమ వాసుల పట్ల దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్షన్ గానీ, మత ఘర్షణలుగానీ ఈ తరం వారికి తెలియవు. అన్ని మతాల పండుగలను అందరూ కలిసిమెలిసి నిర్వహించుకుంటున్నారు. ఆత్మ బంధువుల్లా ఇళ్లకు ఆహ్వానించి విందు ఏర్పాటు చేస్తున్నారు. ఇతర మతాలను ఎంతో గౌరవిస్తున్నారు. ఒకరి ప్రార్థనాలయాలకు మరొకరు వెళుతున్నారు. ఇలాంటి ఒద్దిక మిగతా జిల్లాలలో కనపడదని ఇక్కడికి వస్తున్న ఇతర ప్రాంతాల అధికారుల్లో పలువురు పేర్కొంటున్నారు. మన జిల్లాకు బదిలీ అనగానే జంకుతూ వచ్చే అధికారులు ఇక్కడి నుంచి బదిలీ కావాలంటే జిల్లాను వదల్లేక బాధపడుతుంటారు.

శాంతి సాధన కోసం..

బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం సంస్థ మిగతా ప్రాంతాల్లోగానే మన జిల్లాలో కూడా శాంతి సాధనకై ఎంతో కృషి చేస్తోంది. ఓం శాంతి సంస్థ పేరిట ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ గీతా బెహన్ జిల్లాలో దాదాపు వంద ప్రాంతాల్లో యోగా, ధ్యాన కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రజలకు శాంతిని ప్రబోధిస్తున్నారు. ఓం శాంతి నగర్ పేరిట ఒక వీధిని ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ కూడా దానినే అధికారికంగా ఖాయం చేసింది. జిల్లాలో వ్యాపారులుగా గడుపుతున్న జైనులు కూడా శాంతి సాధనకై ఎంతో కృషి చేస్తున్నారు. వ్యక్తిగతంగా వారు ప్రశాంత జీవనానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. తమ దైవ మందిరాలలో ప్రశాంతంగా ధ్యానం చేసుకుంటూ వాటిని ప్రశాంత నిలయాలుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలుస్తున్నారు.

కోరికలే అశాంతికి మూలం



మన కోరికలే అశాంతికి మూలం. అహంతోపాటు ఆధిపత్య ధోరణి పూర్తిగా తొలగించుకోవాలి. ప్రపంచంలోని పలు దేశాలు యుద్ధ ప్రమాదంలోనే ఉన్నాయి. వారిలో సామరస్య ధోరణిని పెంచేందుకు ఇతర దేశాలు కృషి చేయాలి. ఐక్యరాజ్య సమితి ఈ విషయంగా అన్ని దేశాలను సమ్మతింపజేయాలి.

– పిళ్లా కుమారస్వామి, బుద్ధిస్ట్, కడప